క్రిస్మస్ కోలాహలం..!

- చర్చిలు, గృహాల వద్ద క్రిస్మస్ కాంతులు
- క్రీస్తు జనన వృత్తాంత నాటికల ప్రదర్శనకు యువత సాధన
- జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు


మార్కెట్‌లో విక్రయిస్తున్న క్రిస్మస్ స్టార్లు, అలంకరణ సామగ్రి

మదనపల్లె సిటీ : క్రిస్మస్ కోలాహలం మొదలైంది. ఈనెల 25న క్రైస్తవులకు పర్వదినం. మదనపల్లెలో క్రైస్తవ మందిరాలు, విశ్వాసుల గృహాలు నూతనత్వాన్ని సంతరించుకున్నాయి. సత్యం, శాంతి,కరుణ, త్యాగం, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశాలతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. త్యాగానికి ప్రతీక అయిన క్రిస్మస్ వేడుకను ఈనెల 25న జరుపుకునేందుకు క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ నెల ప్రారంభం నుంచే క్రైస్తవుల ఇళ్లు, ప్రార్థనా మందిరాలు, వీధుల్లో స్టార్స్ ఏర్పాటు చేశారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ప్రత్యేక అరాధనలు, ప్రార్థనలు, సెమి క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మదనపల్లెలో జెసీఎం చర్చిలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూనే 25 నాటికి క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా అలంకరిస్తున్నారు.

జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు :
మదనపల్లె పట్టణంలోని సిటిఎం రోడ్డు, నెహ్రూ బజార్, ఆర్ ఆర్ వీధి, కదిరిరోడ్డు ప్రాంతాల్లోని షాపుల్లో క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, చర్చిల అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల మోడళ్లలో, రేట్లలో ఇవి లభిస్తున్నాయి. ఎలక్ట్రికల్ స్టార్లు, కాగితం, ప్లాస్టిక్‌తో తయారు చేసిన స్టార్లు మార్కెట్‌లో లభిస్తున్నాయి. స్టార్లు రూ.50 నుంచి రూ.600 వరకు ఉన్నాయి. క్రిస్మస్ ట్రీలు సైజు, నాణ్యత మేరకు రూ.100 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. హోప్, సీఎస్ఐ ఉన్నత పాఠశాలల్లో సండే స్కూల్ పిల్లలు, యువజనలు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే నాటికలు, నృత్యాలు సాధన చేస్తున్నారు. క్రిస్మస్ నాడు సువార్త గీతాలు ఆలపించేందుకు క్రైస్తవ యువత ప్రాక్టీస్ చేస్తోంది.

ప్రారంభమైన వేడుకలు :
క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెలంతా నాటికలు, క్యాండిల్ సర్వీసులు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.గృహాలు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగు ఏర్పాటు చేస్తున్నారు.

క్రిస్మస్ చెట్టు వెలిగింది:
క్రిస్మస్ ఎంతో దూరం లేదు. క్రిస్మస్ చెట్టును ఇళ్లల్లో, చర్చి సముదాయాల్లో , ప్రధాన కూడళ్ల దగ్గర,,ముఖ్య ప్రదేశాల్లో ప్రతిష్ఠించి క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ప్రారంభించడం అలవాటు. క్రైస్తవులు అధికంగా ఉండే మదనపల్లె పట్టణంలోని జెసీఎం చర్చిలో సెమి క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రిస్మస్ చెట్టు ఏర్పాటు చేశారు. చెట్టుకు రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దీంతో అప్పుడే క్రిస్మస్ పండుగ కళ వచ్చేసింది. చర్చిల వద్ద పండుగ వాతావరణం నెలకొంది.


క్రిస్మస్ ట్రీ


క్రిస్మస్ ఎలక్ట్రికల్ స్టార్లు

పోస్టాఫీసు తరలింపును అడ్డుకొన్న గ్రామస్తులు


పోస్టల్ అధికారులను అడ్డుకొని నిలదీస్తున్న సింగవారిపల్లె గ్రామస్తులు

గుర్రంకొండ : గ్రామంలోని పోస్టాఫీసు కార్యాలయాన్ని తరలించే కార్యక్రమాన్ని గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని మర్రిమాకుపల్లె పంచాయతీ సింగంవారిపల్లెలో జరిగింది. బుధవారం వాల్మీకిపురం పోస్టల్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్, మెయిల్ ఓవర్సియర్ విశ్వనాథ్‌లు గ్రామానికి చేరుకొని పోస్టల్ కార్యాలయంలో ఉన్న సామగ్రిని పక్కనే ఉన్న మర్రిమాకుపల్లె గ్రామానికి తరలించడానికి సన్నాహాలు చేపట్టారు. విషయం తెలుసుకొన్న గ్రామస్తులు పెద్ద ఎత్తున పోస్టల్ కార్యాలయం వద్దకు చేరుకొని పోస్టల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో 500 మంది జనాభా ఉండగా 1961 సంవత్సరంలో ఇక్కడ పోస్టాఫీసును ఏర్పాటు చేశారన్నారు. 63 సంవత్సరాలుగా ఇక్కడున్న పోస్టాఫీసును పక్క గ్రామమైన మర్రిమాకులపల్లెకు ఎందుకు మార్చుతున్నారని అధికారులను నిలదీశారు. కావాలనే గతంలోనూ మూడుమార్లు పోస్టాఫీసును తరలించడానికి ప్రయత్నించారన్నారు. ఎలాంటి బస్సు సౌకర్యం లేని ఈ గ్రామానికి ఉన్న ఒక్క పోస్టాఫీసు కార్యాలయం తరలించుకుపోవడం ఎంత వరకు సబబుని ప్రశ్నించారు. ఎంతో మంది నిరుపేదలు పోస్టాఫీసులో పొదుపు ఖాతాలు ప్రారంభించి కూలి డబ్బులను పొదుపు చేసుకొంటున్నార న్నారు. పోస్టాఫీసు తరలిస్తే 10 కిలోమీటర్ల పరిధి వరకు ఎక్కడా పోస్టాఫీసు లేదన్నారు. బ్యాంకులకు వెళ్లాలన్నా12 కిలో మీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూలి తాలుకా డబ్బులు పోస్టాఫీసులో తీసుకొంటున్నామన్నారు. ఎంతో అనూకూలంగా ఉన్నా పోస్టాఫీసును తరలించడానికి తాము అంగీకరించబోమన్నారు. ఇక్కడే కొనసాగించాలంటూ గ్రామస్తులు లిఖిత పూర్వకంగా అర్జీ రాసి పోస్టల్ అధికారులకు ఇచ్చారు. దీంతో చేసేదిలే అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి

మదనపల్లె సిటీ : సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ క్రిష్ణవేణి అన్నారు. బుధవార కళాశాలలో ఫోరం ఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో ఆర్టీఐ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2005 అక్టోబర్ 12వతేదీన రాష్ట్రపతి ఆమోదంతో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. సామాన్యుల చేతిలో సమాచారాన్ని ఉంచడం చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదేని సమాచారంకు సంబంధించి ఆర్టీఐ కింద అడిగితే 30 రోజుల్లోపు అధికారులు అందించాలన్నారు. సమాచారహక్కు చట్టం ఆవశ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ ప్రతినిధులు రేవతి, మహాలక్ష్మి, జయప్రద, రాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రను తొలగించారని మహిళల ధర్నా


అంబేద్కర్ విగ్రహం ఎదుట మహిళల ధర్నా

బి.కొత్తకోట : నగర పంచాయతీలోని 17వ సంఘమిత్ర లక్ష్మిని టీడీపీ నాయకుల ఒత్తిడితో అక్రమంగా తొలగించారని నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మహిళలు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలువురిని తొలగిస్తున్నట్టుగా లక్ష్మిని సంఘమిత్ర విధుల నుంచి తొలగించారు. ఆమె స్థానంలో కొత్తగా గౌతమిని నియమించారు. దీనిపై సంఘమిత్ర పరిధిలోని మహిళలు కొత్త సంఘమిత్ర తమకు అవసరం లేదని లక్ష్మిని తిరిగి నియమించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేని, మహిళలంతా ఏకమై కోరుకుంటున్న వ్యక్తికి కాకుండా మరోకరిని టీడీపీ నాయకులు నియమించడం మహిళల అభిప్రాయాలకు విరుద్ధమని అన్నారు. నెల క్రితం సంఘ సమావేశాన్ని బహిష్కరించి వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించగా నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ డీసీ షణ్ముగం

పీలేరు : గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డీసీ షణ్ముగం అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్‌డీజీఎస్)పై మొదటి రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. తొమ్మి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే సుస్థిర అభివృద్ధి
కలకడ : గ్రామాల అభివృద్ధితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని, అందుకు ఉత్తమ ప్రణాళికతో ముందుకు సాగాలని డీఎల్‌డీఓ లక్ష్మిపతి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. గ్రామీల అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బందిచే ప్రమాణం చేయించారు. అన్ని పంచాయతీలలో అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం కోరారు.

తంబళ్లపల్లెలో..
తంబళ్లపల్లె: స్థానీకరణ, సుస్థిర అభివృద్ధికి లక్ష్యాలను 2030 నాటికి పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని ప్రతి పంచాయతీ మంచి ర్యాంకుతో అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,విఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం కూడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, కార్యాలయ ఏఓ థామస్, ఎంఈఓ త్యాగరాజ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

నిమ్మనపల్లె : బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ మదనపల్లి ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయములో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి కలిసి 'కిషోరి వికాసం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలికలకు వివాహాలు చేయడం ద్వారా వారి జీవితంలో అనేక సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వివరించారు. గ్రామస్థాయి నుంచి బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. అంగనవాడీ కార్యకర్తలు ప్రతి శనివారం వారి గ్రామంలో యుక్త వయసులోని బాలికలతో, వారి తల్లిదండ్రులతో అవగాహన సమావేశాలను నిర్వహించి కిషోరి వికాసం రిజిస్టర్ లో సమాచారాన్ని పొందుపరచాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చేదిద్దడానికి అందరూ బాధ్యత వహించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష అంగన్వాడీ సూపర్‌వైజర్ భాను, లక్ష్మీదేవి, హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సుస్థిర అభివృద్ధే లక్ష్యం


శిక్షణ తరగతుల్లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గుర్రంకొండ : గ్రామాల్లో సమగ్ర సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఎల్ఎస్ డీజీ పథకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులపై అందరూ దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తాగునీటి కోసం నిధులు కేటాయించాయన్నారు. బాల్యవివాహాల అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. సమాజంలో పిల్లల పెంపకంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు సరైన మార్గంలో పెంచకపోతే జరగబోయే అనర్థాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి, ఏఈ నాగశివారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణెమ్మ పాల్గొన్నారు.

గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వి. లక్ష్మీపతి, హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కేవీపల్లె : మండలంలోని గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాయచోటి డీఎల్‌డీవో వి. లక్ష్మీపతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్‌డీజీఎస్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఎస్‌డీజీఎస్ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా తొమ్మిది అంశాల్లో గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందడానికి సమష్టి కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీడీవో సుధాకర, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శిక్షణకు సర్పంచ్‌ల గైర్హాజరు
పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఆర్థిక ఆదాయ వనరులు, సంపద తయారీ విధానం, గ్రామ పంచాయతీల లక్ష్యాలు, అభివృద్ధికి చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అయితే మండలంలో 20 మంది సర్పంచ్‌లు ఉండగా ఈ శిక్షణ కార్యక్రమానికి ఇద్దరు ముగ్గురు మినహా మిగిలిన వారంతా గైర్హాజరు కావడం వెనుక ఆంతర్యం ఏమిటో అధికారులకే ఎరుక. గ్రామాల్లో సమస్యలు పేరుకు పోతున్నా, ప్రజా సమస్యలను వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చులతో తాము నిధులు వెచ్చించినా అధికారులు బిల్లులు పెట్టడంలో అలసత్వం వహిస్తున్నందు వల్లే తాము శిక్షణను బాయ్‌కాట్ చేసామని పలువురు సర్పంచ్‌లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సుకు ఎండోమెంట్ అధికారుల డుమ్మా

- మధ్యాహ్నం 3 వరకు వేచి చూసిన ప్రజలు
- కమ్మపల్లెలో 16 అర్జీలకు 8 ఎండోమెంట్ సమస్యలే...
- ప్రయోజనం లేని సదస్సులు ఎందుకని ప్రజలు అసహనం


ఎండోమెంట్‌శాఖ సమస్యపై రెవెన్యూ సదస్సులో అర్జీ సమర్పిస్తున్న మోతీనగర్ కాలనీ వాసులు

మదనపల్లె : రాష్ట్రంలో భూ సమస్యలకు ముగింపు పలికేందుకే రెవెన్యూ సదస్సులు అని చెప్పుకున్న కూటమి ప్రభుత్వం మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ, అధికారులు హడావిడి చేస్తున్నారే తప్ప ఆశించిన స్థాయిలో ఫలితాలు అందడం లేదు. బుధవారం మదనపల్లె మున్సిపాలిటీ కమ్మపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి నామమాత్రపు స్పందన లభించింది. ఉదయం 9 గంటలకు రెవెన్యూ సదస్సులు ప్రారంభమైనప్పటికీ, 11 గంటల సమయంలో నోడల్ అధికారి అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ సిబ్బంది తప్ప ఇతర శాఖలకు చెందిన అధికారులు ఎవరూ కనిపించలేదు. ముఖ్యంగా కమ్మపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు వస్తే..అందులో 8 అర్జీలు ఎండోమెంట్ సమస్యలపై వచ్చాయి. అయితే ప్రజలు అర్జీలు సమర్పించేటప్పుడు ఎండోమెంట్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారి కోసం సుమారు 4 గంటలకు పైగా ప్రజలు నిరీక్షించారు. మదనపల్లె రెవెన్యూ గ్రామానికి సంబంధించి సర్వేనెంబర్.296లో 5.20 ఎకరాల భూమిలో పట్టణానికి చెంది నెమలి వంశస్థులు లేఅవుట్ వేసి ప్లాట్లను విక్రయిస్తే పేద, మధ్యతరగతికి చెందిన సుమారు 90 మందికి పైగా కొనుగోలు చేశామన్నారు. దేవదాయశాఖ ఆదీనంలోని బొంతల సత్రం కమ్మపల్లె రెవెన్యూ పరిధిలో ఉంది. అందులో బొంతలవారి సత్రానికి సంబంధించిన 33 సెంట్లును సబ్‌డివిజన్ చేస్తూ మదనపల్లె రెవెన్యూ గ్రామపరిధిలోని సర్వేనెంబర్.296ను పొరపాటుగా దేవునిమాన్యంగా రెవెన్యూ అధికారులు నమోదుచేశారు. దీంతో దాదాపు 15ఏళ్లుగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వాటిని అమ్ముకోలేక, బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎండోమెంట్ జాబితా నుంచి తమ సర్వే నెంబర్‌ను తొలగించాల్సిందిగా అనేకమార్లు రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులకు అర్జీలు సమర్పించినా ప్రయోజనం లేదని వాపోయారు. కూటమిప్రభుత్వం రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరిస్తామంటే....ఎంతో ఆశతో వచ్చిన మోతీనగర్ వాసులకు నిరాశే మిగిలింది. వారి సమస్యను పరిష్కరించాల్సిన ఎండోమెంట్ అధికారి లేకపోవడంతో ఆయన కోసం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఎండోమెంట్ అధికారి లేకపోవడంతో ప్రజలు ఇచ్చిన అర్జీలకు అధికారులు రసీదులు ఇవ్వలేదు. దీంతో ప్రజలు రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం సదస్సులు నిర్వహించలేనప్పుడు వీటిని నిర్వహించి ప్రయోజనమేంటని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత


భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని 35వార్డుల్లో మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీలో రూ.4.99 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, సొసైటీకాలనీలో రూ.4.99 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి ఆయన భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వార్డులో అభివృద్ధిపనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, నాయకులు పులిమహాలక్ష్మి, రాధ, బెల్లే రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

పక్కాగా వందరోజుల ప్రణాళిక
– డీఈఓ సుబ్రమణ్యం


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ

బి.కొత్తకోట : పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని డీఈఓ సుబ్రమణ్యం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బీరంగి జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంతో మాట్లాడుతూ వంద రోజుల కార్యక్రమాన్ని తప్పకుండా అమలు చేయాలన్నారు. వ్యక్తిగత శ్రద్ధతో పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. తర్వాత బి.కొత్తకోట ఆదర్శ విద్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరు, పరీక్షల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట పీటీఎం ఎంఈవో నారాయణ, ప్రిన్సిపాల్ శీనునాయక్, హెచ్‌ఎం మునుస్వామి ఉన్నారు.

ఫైర్ సిబ్బందికి రెస్క్యూ సామగ్రి అందజేత


అగ్నిమాపక సిబ్బందికి సామగ్రిని అందిస్తున్న దాతలు

మదనపల్లె : జిల్లా అగ్నిమాపక సిబ్బందికి, పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ్ ప్రదాన్ బుధవారం ఫైర్ రెస్క్యూ సమయంలో వినియోగించే సామగ్రిని అందజేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్, మదనపల్లె ఫైర్‌ఆఫీసర్ శివప్పల సమక్షంలో 106 గంబూట్స్, 106 హెల్మెట్స్, 50 గాగుల్స్, 20 టార్చిలైట్లు అగ్నిమాపక సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో వాయల్పాడు ఫైర్ ఆఫీసర్ ఎస్.బాబు, ఫైర్‌సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలి


వేర్ హౌస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : నిత్యావసర సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 56 చౌకదుకాణాలు ఉన్నాయని, లబ్ధిదారులకు బియ్యం, చక్కెర కందిపప్పు విధిగా పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, చక్కెర, ఆయిల్ పంపిణీ చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. తిరుపతి రోడ్డులోని వేర్‌హౌస్ గోడౌన్ స్టాకు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయర్స్ డీటీ విజయకుమార్ రెడ్డి, చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లే

కురబలకోట : నిరంతరం అవసరమయ్యే విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తే తద్వారా ఉత్పత్తి చేసినట్లేనని విద్యుత్ శాఖ మాజీ ఎస్ఈ సూర్యనారాయణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోల్డెన్ వ్యాలీ కళాశాలలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చాలా విలువైనదే కాదు అత్యవసరమైనదన్నారు. విద్యుత్ లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. పొదుపుగా వాడుకుంటే బిల్లుల భారం తగ్గుతుందన్నారు. సోలార్, విండ్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై దృష్టి సారించాలన్నారు.

రాష్ట్రీయ గ్రామస్వరాజ్య అభియాన్ శిక్షణ కార్యక్రమం

రామసముద్రం : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కింద శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ...సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు మండల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, మండల స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. అభివృద్ధి పథం ముందుచూపుగా 2030 నాటికి, అలాగే 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలాదేవి, మెడికల్ ఆఫీసర్ లీల, ఏఈలు రమణ, రియాజ్, ఎంఈఓ హేమలత, ఏపీఎం సాంబశివ, ఏపీఓ గౌరీశంకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కిషోరి వికాసంపై అవగాహన


బాల్యవివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

తంబళ్లపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సీడీపీఓ నాగవేణి ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై వివరించారు. లింగవివక్షత, అక్షరాస్యత, బాలికావిద్య, వ్యక్తిగత రక్షణ, లింగ సమానత్వం తదితర అంశాలపై తెలియజేశారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు అందరం సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఏఓ థామస్, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ

పీలేరు : లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్ తప్పనిసరిగా జిల్లాలో అధికారిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రికార్డులు, రిపోర్టులు సక్రమంగా నిర్వహించి సకాలంలో జిల్లా కార్యాలయానికి సమర్పించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగ సాధనకు ఇంటర్న్‌షిప్ ఆయుధం


ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన మిట్స్ విద్యార్థులు

కురబలకోట : ఉద్యోగ సాధనకు ఇంటర్న్‌షిప్ ఆయుధమని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన పది మంది బిటెక్ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా తైవాన్‌కు వెళ్లారు. అక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త నైపుణ్యాలు, టెక్నిక్‌లను నేర్చుకున్నట్లు తెలిపారు. వీరికి బుధవారం కళాశాలలో ప్రసంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. వీరిలో సాయి మౌనిష్, దాదాపీర్, రిషిత, ప్రణీత, సాయి స్ఫూర్తి, అమేయశ్రీ, ధనుష్‌రెడ్డి, అలీ సయ్యద్, ఇందు ఈశ్వర్ శివాని, పూజిత ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

సీఎస్ఐ చర్చిలో సిల్వర్ జూబ్లి వేడుక

బి.కొత్తకోట: స్థానిక సీఎస్ఐ చర్చి ఏర్పడి పాతికేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సిల్వర్‌జూబ్లి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. చర్చిని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకకు హాజరైన రాయలసీమ డయాసిస్ డాక్టర్ పి.ఐజాక్ వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.